'సచివాలయం'తో సమూల మార్పులు

'గడప గడపకు' కార్యక్రమంలో
ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



దివ్యాంగుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

మాచవరం: మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శ్రీరుక్మిణీపురంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడారు. సచివాలయ వ్యవస్థతో మారుమూల పల్లెలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. మాచవరం మండల కేంద్రానికి దూరంగా ఉన్న శ్రీ రుక్మిణీపురం, నాగేశ్వరపురం తండా గ్రామస్తులు గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉందని గుర్తుచేశారు. నేడు ఆ గ్రామంలోని సచివాలయం ద్వారా వారి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ ద్వారా ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందుతోందన్నారు. రుక్మిణీపురంలో సుమారు రూ.10 కోట్లతో నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే చెప్పారు. నేడు–నేడు పథకం కింద పాఠశాలను అభివృద్ధి చేశామని, సీసీ రోడ్లను నిర్మించుకున్నామని, రూ. 20 లక్షలతో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జెడ్పీటీసీ జువ్వె నబోయిన శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీలు నన్నె, లక్ష్మయ్య, యూత్ కన్వీనర్ మద్దు ప్రసాద్, జిలుగు నరసింహారెడ్డి, సర్పంచ్ కుర్ర భూలక్ష్మి రామారావు, మాజీ సర్పంచ్ అనంగి వెంకటేశ్వర్లు(పాలబాబు), గ్రామ నాయకులు కృష్ణ, వెంకట్రామయ్య, అధికారులు ఎంపీడీఓ రాజగోపాల్, పంచాయితీరాజ్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం



గురజాల: మండల పరిధిలోని గంగవరం గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. మంగళవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణ వేదికపై స్వామి ఉత్సవ విగ్రహాలు ఉంచి కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. పలువురు దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తగు చర్యలు తీసుకున్నారు.

పార్టీకోసం కష్టపడి పనిచేయాలి



దాచేపల్లి: వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పార్టీ వాణిజ్య విభాగం పల్నాడు, బాపట్ల జిల్లాల జోనల్ ఇన్‌చార్జీగా నియమితులైన మాశెట్టి బుజ్జిని ఎమ్మెల్యే కాసు మంగళవారం అభినందించారు. తనకు ఈ బాధ్యతలు రావటానికి కృషి చేసిన ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని శాలువా, పూలమాలతో బుజ్జి సన్మానించారు. బుజ్జి నియమకం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే కాసును కలిసిన వారిలో మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నేత హరిబాబు మృతి



పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పట్టణ మాజీ కోశాధికారి అకుల హరిబాబు(52) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆయన కొన్ని రోజులుగా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్యం క్షీణించి హరిబాబు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు నివాళులర్పించారు. మృతినికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మాచవరం: మండలంలోని సింగరాయపాలెం తండా సమీపంలోని కొండపై వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత సింగరుట్ల స్వయంభు శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు వేద మంత్రాలతో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దంపతులతో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మహా అన్న దానం చేశారు. పిల్లుట్లలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

త్రికోటేశ్వరుని సేవలో విజయనగరం ఎంపీ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లం చంద్రశేఖరరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎంపీ చంద్రశేఖరరావుకు ఈవో వేమూరి గోపి స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం శేషవస్త్రం, తీర్థప్రసాదాలు బహుకరించారు. తరువాత వేదపండితుల ఆశీర్వచనాలు అందజేసారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈవో గోపి ఎంపీ చంద్రశేఖర రావుకు వివరించారు. భక్తులకు అమలుచేస్తున్న అన్నప్రసాదాన్ని ఎంపీ స్వీకరించారు. పాతకోటయ్యస్వామి ఆలయానికి చేపట్టిన మెట్ల మార్గానికి ఎంపీ లాడ్స్ నుంచి రూ.5 లక్షల విరాళాన్ని ఎంపీ చంద్రశేఖర్ ప్రకటించారు.

మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్ కృషి



చైర్‌పర్సన్ సుబ్బమ్మ, కమిషనర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

దాచేపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. నడికుడి సచివాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుబ్బమ్మ, వైస్ చైర్‌పర్సన్లు కొమెరబత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్‌బీ, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, సీఓ విజయలక్ష్మీలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత కోసం పని చేస్తున్నారని, మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందన్నారు. పురుషులతో పాటు మహిళలు రాజకీయం, వ్యాపారం, ఉద్యోగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, ఏపీఎం జానీ, నాయకులు శ్రీరాములు, కొగంటి మణికంఠ, వెంకటరెడ్డి, పిచ్చయ్య, ఆర్పీలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించండి

గురజాల: నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు ఇంటి పన్ను త్వరితగతిన చెల్లించాలని కమిషనర్ మోహన్ శ్రీనివాస్ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి 31 లోపు వంద శాతం ఇంటి పన్ను చెల్లించేలా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆధార్‌కార్డు ఇప్పించండి సారూ...



వరాలమ్మ

కారెంపూడి: వృద్ధాప్యపు ముంగిట ఉన్న ఒక నిరుపేద గిరిజన ఒంటరి మహిళ ఆధార్ కార్డు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. తన తోటివారు ప్రతి నెలా ఠంఛనుగా పింఛన్, ఇత ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటుంటే.. పోయిన తన ఆధార్‌కార్డు కోసం కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. కారెంపూడిలోని గని గుంతల ప్రాంతంలో అరబోలు వరాలమ్మ అనే 52 ఏళ్ల ఒంటరి మహిళ జీవిస్తోంది. స్థానిక గ్రామాల్లో తిరిగి దువ్వెనలు, అద్దాలు అమ్ముతూ..జీవనం సాగిస్తోంది. 2012లో ఆమె ఉంటున్న గుడారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఇందులో ఆధార్ కార్డు కూడా కాలిపోయింది. నిరక్షరాస్యురాలు కావడంతో ఆ కార్డు నంబరు కానీ, జిరాక్స్ లేకపోవడంతో కొత్తకార్డు పొందడం ఆమెకు సమస్యగా మారింది. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా కార్డు ఉన్నట్లుగా వస్తోంది. కాల్ సెంటర్ 1947కు ఫిర్యాదు చేసి, వారు చెప్పినట్లుగా గెజిడెట్ ఫాం పూర్తిచేసి పంపినా ఎర్రర్ వస్తోంది. సంబంధిత అధికారులను సంప్రదిస్తే ఆధార్ కేంద్ర కార్యాలయాన్ని సంప్రదించాలని సలహా ఇస్తున్నారు. ప్రతి రోజూ ఆధార్ సెంటర్, పోస్టాఫీసు చుట్టూ తిరుగుతూనే ఉంది. అనారోగ్యంతో ఆమె భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఉన్న ఒక్క కుమార్తెకు వివాహమై అత్తింటికి వెళ్లిపోయింది. ఉండడానికి ఇల్లు కూడా లేదు. వృద్ధాప్యంతో వ్యాపారం చేయలేకపోతే నా పరిస్థితేంటని ఆమె కన్నీళ్ల పర్యంతం అవుతోంది. విషయం చిన్నదే.. అనిపించినా.. అది ఆమెకు పెద్ద సమస్యే.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: స్వయం సంఘాల్లోని మహిళా సభ్యులు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని మంచి ఆర్థిక ప్రగతి సాధించాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ కోరారు. మంగళవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో స్వయం సహాయక మహిళా సభ్యులకు రుణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ డిపాజిట్స్ అధికంగా వడ్డీరేటు ఇస్తున్న ప్రభుత్వరంగా బ్యాంకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అన్నారు. గత డిసెంబరు నెల నుంచి నేటి వరకు 48 మహిళా గ్రూపులకు రూ. 5 కోట్లు 70 లక్షలు రుణాలు మంజూరు చేశామన్నారు.

మహిళలను గౌరవించడం మన సంప్రదాయం



విద్యార్థులతో డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్‌పూర్ సభ్యులు

రెంటచింతల: మహిళలను గౌరవించడం మన దేశ సంప్రదాయమని సమాజం అభివృద్ధిలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ పూర్ అధ్యక్షురాలు సింగారెడ్డి థామాసమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రెంటచింతలలోని బాలవికాస్, ఫాతిమా విద్యానికేతన్ తదితర పాఠశాలల విద్యార్థులతో కలిసి స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎందులోనూ తీసిపోరని, ప్రస్తుత సమాజంలో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. మహిళల హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ పూర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శారదాదేవి, పక్కన జడ్జి మధుబాబు

మాచర్ల: ప్రతి మహిళ తన హక్కులను పరిరక్షించుకునేందుకు బలమైన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు అదనపు జడ్జి శారదాదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి శారదాదేవి మాట్లాడుతూ.. ప్రతి మహిళకు కోర్టులు రక్షణ కల్పిస్తున్నాయన్నారు. గృహహింసా నిరోధక, దిశ లాంటి చట్టాలు అనేకం మహిళలకు రక్షణగా ఉన్నాయని తెలిపారు. జడ్జి మధుబాబు మాట్లాడుతూ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మహిళా హక్కులపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళా హక్కులు, చట్టం గురించి కమిషనర్ ఈవీ రమణబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రామునాయక్, మెప్మా ప్రాజెక్ట్ స్థానిక మేనేజర్ సుబ్బారావు, సీనియర్ న్యాయవాది సత్య నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం



సర్వే చేపడుతున్న అధికారులు

రెంటచింతల: రెంటచింతల మండల కేంద్రంలో మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారి (ఎన్‌హెచ్167 ఏడీ) అభివృద్ధి పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు ప్రధాన రహదారికి ఇరువైపులా ఆర్ అండ్ బీ, ప్రభుత్వ పోరంబోకు స్థలాన్ని గుర్తించి, హద్దులు నిర్ధారించారు. 30 నుంచి 35 మీటర్ల వరకు ఉన్న ఈ స్థలంలో ఉన్న ఆక్రమణదారులు తమ షాపులను తొలగించుకోవాలని సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి గ్రామ శివారులోని బాలజీ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వరకు ఒకటిన్నర కిలోమీటర్ పరిధిలో రహదారి అభివృద్ధి పనులను రూ.74 లక్షలతో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దాసరి కాంతారావు, మండల సర్వేయర్ సుధాకర్, గ్రామ కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుబ్బయ్యపాలెంలో తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్లను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. తిరునాళ్లను పురస్కరించుకొని గ్రామస్తులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్వామివారి భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

నాదెండ్ల: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న రీసర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. చిరుమామిళ్ల గ్రామంలో మంగళవారం రీసర్వే పనులను ఆమె పరిశీలించారు. గ్రామంలో రీసర్వే పనులు 75 శాతం పూర్తికాగా గడిచిన రెండు రోజులుగా హద్దు రాళ్ల ఏర్పాటు కార్యక్రమం జరుగుతోంది. సుమారు వందేళ్ల అనంతరం తిరిగి ప్రస్తుతం భూముల సర్వే జరుగుతోందని, దీంతో గ్రామాల్లో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. రీసర్వే అనంతరం రైతులకు పత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాదెండ్ల సొసైటీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ

నాదెండ్ల: జాతీయ రహదారిపై వెళ్తున్న లారీని మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీ ముందుభాగం ధ్వంసమైన సంఘటన చిలకలూరి పేట ఏఎంజీ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. గుంటూరు నుంచి తమిళనాడుకు పైపులలోడుతో వెళ్తున్న లారీని పొగాకును గణపవరంలో అన్‌లోడ్ చేసి తిరిగి జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకునే క్రమంలో మరో లారీ పైపులలోడు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో పొగాకు లారీముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే ప్రమాదంలో ఎవరూ గాయాలపాలు కాలేదు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గురైన లారీని రోడ్డుపై నుంచి తొలగించారు.

వీధి కుక్కల పట్టివేత

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో పంచాయతీ వారి సారథ్యంలో వీధి కుక్కలు పట్టివేత కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు తెలిపారు.

ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కల సంచారం ఉండటంతో గ్రామ స్తుల సహకారంతో సత్వర చర్యలు చేపట్టామన్నారు. పట్టుకున్న కుక్కలను అడవిలో వదిలి వేస్తామన్నారు. నాలుగు రోజుల పాటు ఈకార్యక్రమం కొనసాగుతుందని 50 కుక్కలను పట్టుకున్నట్లు చెప్పారు.

వేసవిలో నీటి ఎద్దడిని నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

వెల్దుర్తి: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీఓ డి.ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వాటర్ ఎయిడ్ ఇండియా సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది గ్రామాల్లో నీటి పరీక్షలు చేయించాలన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. రెండు గుంతలు ఉండే సెప్టిక్ ట్యాంక్‌లను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త చంద్రశేఖర్, మాడబోయిన గురుప్రసాద్, రాజశ్రీ, లక్ష్మణరావు, రవివర్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మంచి పౌరులుగా ఎదగండి



వినుకొండ టౌన్: ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోపాటు దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించి మంచి పౌరులుగా ఎదగాలని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు భువనగిరి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని మసీదు మాన్యంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తమ సంఘం తరుపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా కేంద్రంలోని 40 మంది చిన్నారులకు ఉపయోగపడే రైస్ కుక్కర్, వాటర్ ట్యాంక్, ప్లేట్లు, గ్లాసులు, ఇతర సామగ్రిని కేంద్రం నిర్వాహకులకు అందచేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, రామలింగేశ్వరరావు, జోజయ్య, టి. శేషయ్య, ఎంవి. శర్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పోలింగ్ కేంద్రాలు సిద్ధం

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని జెడ్పీ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కమిషనర్ అనిశెట్టి శ్రీ విద్య మంగళవారం తెలిపారు. 3వ వార్డు కౌన్సిలర్ మునగా రమాదేవి ఇటీవల మృతి చెందటంతో ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ వార్డు పరిధిలో 1,596 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేస్తే ఎన్నికలు నిర్వహించేలా అధికారులు సమాయత్తం అవుతున్నారు.

విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



స్వామి వివేకానంద పుస్తకాలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

వెల్దుర్తి: స్వామి వివేకానంద 125వ జయంతి వార్షికోత్సవాల సందర్భంగా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో శిరిగిరిపాడు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి స్వామి వివేకానంద పుస్తకాలను అందజేసి, అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. విద్యార్థి దశ నుంచే స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని జాగృతి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజకుమార్, ఉపాధ్యాయులు, చంద్రయ్య, లాలుసాహెబ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న భూసమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు భాగంగా మంగళవారం ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రత్నాకర్ సాయిమాధచార్యులు, వెంకట శేషాచార్యులు, సాత్విక్ వేదమంత్రాలు, మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. గరుడవాహనంపై ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయాన్ని విద్యుత్ దీప కాంతులతో ముస్తాబు చేశారు.